www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 16 జూలై 2023
5



ఏలూరు

పేదలపై భారాలు.. సంపన్నులకు రాయితీలు

ఉంగుటూరు:కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంపన్నులకు రాయితీలు కల్పిస్తూ, సామాన్య – మధ్య తరగతి ప్రజలపై మోయలేని పన్నుల భారాలు మోపుతున్నాయని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు విమర్శించారు. ఈ మేరకు శనివారం సిఐటియు మండల స్థాయి ముఖ్యుల సమావేశం స్థానిక పంచాయతీ కమ్యూనిటీ హాలులో జరిగింది. ఈ సమావేశానికి సంఘం మండల అధ్యక్షులు సీరా అప్పారావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా లింగరాజు మాట్లాడుతూ ఎన్నికల్లో తియ్యని మాటలు పలికి ఓట్లు దండుకుని తీరా అధికారంలోకి వచ్చిన పాలకులు ప్రజ, ఉద్యోగుల పట్ల నియంతలా వ్యవహరించడం సిగ్గు చేటన్నారు. ప్రజావ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తున్న వారిపై తప్పుడు కేసులు పెట్టడం, మానసికంగా వేధించడం సబబు కాదన్నారు. పోరాటాల ద్వారా సాధించుకున్న హక్కులను కార్మికులకు వ్యతిరేకంగా మార్పులు చేయడం అన్యాయమన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం పూర్వపు జిల్లా అధ్యక్షులు గుత్తికొండ వెంకటకృష్ణారావు, సిఐటియు జిల్లా కార్యదర్శి కొక్కిరపాటి వెంకట్రావు, సో మేశ్వరరావు, జి.అనిల్‌కుమార్, పి.యిర్మీయా, బి.అనంతలక్ష్మి, ఆంజనేయులు పాల్గొన్నారు.

ఉద్యోగాల భర్తీలో
క్రీడా కోటాకు ఎసరు..!

విజేతలకు ప్రోత్సాహకాలు, ఆర్థిక సాయమే
2023-28 క్రీడా పాలసీలో కసరత్తు
జిల్లాలో 50 వేల మంది క్రీడాకారుల్లో ఆందోళన
ప్రభుత్వ యోచనపై పెదవి విరుపు

ప్రజాశక్తి – భీమవరం

ఉద్యోగాల భర్తీలో ఇప్పటి వరకు అమలు చేస్తున్న స్పోర్ట్స్ కోటాను రద్దు చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో మెడల్స్ సాధించిన వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలు కల్పించడం ఆనవాయితీగా వస్తోంది. దీనివల్ల ఎంతోమంది ఆటగాళ్లు క్రీడా కోటాలో పలు ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలు పొంది పని చేస్తున్నారు. అయితే ఇకపై ఆ విధానం రద్దు చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు మొదలుపెట్టింది. ఈ నేపథ్యంలో క్రీడాకారుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

దేశ పేరు ప్రఖ్యాతులను ప్రపంచ దేశాల ముందు నిలపడంలో క్రీడారంగం ముఖ్య భూమిక పోషిస్తోంది. ఈ రంగంలో క్రీడాకారులు ఇతర దేశాలను తలదన్నేలా రాణిస్తూ ప్రపంచం నలుమూలల కీర్తి ప్రతిష్టలను చాటుతున్నారు. దీనికి అనుగుణంగా ప్రభుత్వం క్రీడాకారులను ప్రోత్సహించడంతోపాటు ప్రభుత్వశాఖల్లో ఉద్యోగావకాశాలు కూడా కల్పిస్తూ వస్తోంది. జిల్లాలో సుమారు 50 వేల మంది క్రీడాకారులు ఉన్నారు. వివిధ క్రీడల్లో వీరు రాణిస్తున్నారు. ఇప్పటికే క్రీడల్లో రాణించిన వారు ఎంతోమంది ప్రభుత్వ ఉద్యోగ అవకాశాలు పొంది ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారు. అయితే ప్రభుత్వం క్రీడా పాలసీలో మార్పులు, చేర్పులపై కసరత్తు చేస్తోంది. దీనిలో భాగంగానే ఉద్యోగాల్లో క్రీడా కోటాను రద్దు చేసేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ఇప్పుడున్న క్రీడా విధానంలో మార్పులు చేసి క్రీడల్లో రాణించిన వారికి కేవలం ప్రోత్సాహకాలు, ఆర్థిక సాయం అందించి చేతులు దులుపుకునేలా కొత్తగా 2023-28 క్రీడా పాలసీని ప్రకటించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఇప్పటికే పలువురు అధికారులు, క్రీడా నిపుణులతో కూడా ప్రభుత్వం చర్చలు జరిపింది. ఇదే సమయంలో ఆటగాళ్లకు ఉద్యోగావకాశాలపైనా కీలక నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. మెడల్స్ సాధించిన వారికి ఉద్యోగావకాశాలు కల్పించే విధానానికి స్వస్తి పలకాలని నిర్ణయించారు. రానున్న కాలంలో జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో మెడల్స్ సాధించిన వారికి కేవలం ప్రోత్సాహకాలు, ఆర్థిక సాయం మాత్రమే అందించాలని నిర్ణయించారు.



క్రీడారంగంపై నీలినీడలు.. క్రీడాకారుల పరిస్థితి ప్రశ్నార్థకం

ఇప్పటి వరకు మెడల్స్ సాధించిన వారికి అనేక రాష్ట్రాల్లో గౌరవ సూచకంగా ఉద్యోగాలు ఇస్తున్నారు. ఆటగాళ్లకు ఉద్యోగావకాశాల్లోనూ ఎక్కువగా పోలీస్, రెవెన్యూ శాఖల్లో లభిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం కూడా గణనీయంగా రాణించిన వారికి సర్వీసెస్, రైల్వే వంటి వాటిలో ఉద్యోగావకాశాలు కల్పిస్తోంది. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం క్రీడల కోటాలో ఉద్యోగాలు రద్దు చేయడానికి అడుగులు వేస్తోంది. తాజాగా 'ఆడుదాం ఆంధ్ర' నిర్వహణ నేపథ్యంలో ఉన్నతాధికారుల కమిటీ నిర్వహిస్తున్న భేటీల్లో స్పోర్ట్స్ పాలసీపై కొంతమంది మాజీ సీనియర్ ఆటగాళ్లు, క్రీడా నిపుణుల నుంచి సూచనలు వచ్చినట్లు ప్రచారం సాగుతోంది. ఈ నేపథ్యంలో క్రీడారంగం నిర్వీర్యమయ్యే అవకాశాలు ఉన్నట్లు క్రీడారంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వ యోచనపై క్రీడాకారులు, క్రీడారంగ నిపుణులు పెదవి విరుస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయం అమలైతే క్రీడాకారుల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారనుంది.

ప్రభుత్వ నిర్ణయం సరైంది కాదు

డి.ప్రసన్నకుమార్, జాతీయస్థాయి క్రీడాకారుడు



వాలీబాల్, నెట్‌బాల్ క్రీడల్లో పలు రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుండి ఆదిలాబాద్, వరంగల్, రంగారెడ్డి, వైజాగ్, తూర్పుగోదావరి, కృష్ణా జిల్లాల్లో పాల్గొన్నాను. ఢిల్లీలో జాతీయస్థాయి పోటీలు, 2019-20లో కేరళలో జరిగిన ఆలిండియా యూనివర్సిటీ జాతీయస్థాయి నెట్‌బాల్ పోటీల్లో పాల్గొన్నాను. క్రీడాకోటాలో క్రీడాకారులకు న్యాయం చేయాలే తప్ప ఉన్నది రద్దు చేసే ప్రభుత్వ యోచన సరైంది కాదు.

క్రీడాకోట మరింత చేరువ చేయాలి

జివిఎస్.విజయకుమార్, జాతీయస్థాయి క్రీడాకారుడు



ఏడో తరగతి నుండి నేను క్రీడలు ఆడుతున్నాను. నెట్‌బాల్, సాఫ్ట్‌బాల్‌లో ఇప్పటివరకు సుమారు 15 రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని పతకాలు సాధించాను. హర్యానా, కర్నాటకలో జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్నాను. 2019-20 (కేరళ), 2021-22 (తమిళనాడు) ఆలిండియా యూనివర్సిటీ నేషనల్ పోటీల్లో పాల్గొన్నాను. పోలీస్ లేదా ఫిజికల్ డైరెక్టర్ కావాలనేది నా ఆశయం. స్పోర్ట్స్ కోటా వల్ల క్రీడాకారులు ఇప్పుడు కొంత లబ్ధి పొందుతున్నారు. ఈ క్రీడా కోటాను క్రీడాకారులకు మరింత చేరువ చేయాలి.

ప్రభుత్వ ఉద్యోగంలో సేవ చేయాలనేది కోరిక

టి.జ్యోతిశ్రీ, జాతీయ స్థాయి క్రీడాకారిణి



సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్, నెట్‌బాల్ క్రీడలు ఆడుతున్నాను. ఆలిండియా జాతీయస్థాయి యూనివర్సిటీ పోటీల్లో చండీఘర్, హర్యానా రాష్ట్రాల్లో ఆడాను. ప్రస్తుత పోటీ ప్రపంచంలో క్రీడాకారులకు ఉద్యోగాల్లో కోటాను పెంచాల్సిన అవసరం చాలా ఉంది. ప్రభుత్వ ఉద్యోగం సాధించి సేవ చేయాలనేది నా కోరిక.

క్రీడారంగం, క్రీడాకారులను ప్రభుత్వాలు ప్రోత్సహించాలి

వి.వినీత్, కోచ్



క్రీడాకారులకు స్పోర్ట్స్ కోటా అనేది చాలా అవసరం. గ్రామీణ ప్రాంతాలు, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే క్రీడాకారులు, మధ్యతరగతి విద్యార్థులకు క్రీడాకోటా ఎంతో ఉపయోగపడుతుంది. కేంద్ర ప్రభుత్వం 64 క్రీడలకు స్పోర్ట్స్ కోటాలో అవకాశం కల్పిస్తుండగా రాష్ట్రంలో కేవలం 30 క్రీడలకు మాత్రమే అవకాశం కల్పిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన జిఓలను రాష్ట్ర ప్రభుత్వం కూడా అమలు చేసి 64 క్రీడలకు వర్తింపజేసి స్పోర్ట్స్ కోటాను పెంచాలి. క్రీడారంగాన్ని, క్రీడాకారులను ప్రభుత్వాలు ప్రోత్సహించాలి.

మాలాంటి క్రీడాకారులకు కోటా ఎంతో అవసరం


ఎం.పల్లవి, జాతీయస్థాయి క్రీడాకారిణి



ఇంటర్మీడియట్ స్థాయి నుండి నేను క్రీడలు ఆడటం మొదలుపెట్టాను. బేస్‌బాల్, నెట్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని పతకాలు సాధించాను. 2019 (పంజాబ్ రాష్ట్రంలో) జాతీయ స్థాయి పోటీల్లో, 2022-23లో హర్యానా రాష్ట్రంలో జరిగిన ఆలిండియా యూనివర్సిటీ జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్నాను. పిఇటి టీచర్ అవ్వాలనుకుంటున్నాను. స్పోర్ట్స్ కోటా ఉంటే మాలాంటి క్రీడాకారులు ఉద్యోగాలు సంపాదించుకోవడానికి అవకాశం ఉంటుంది.

క్రీడాకారులకు స్పోర్ట్స్ కోటా ఎంతో అవసరం

కెబిఎస్.అన్నవరపురెడ్డి, జాతీయస్థాయి క్రీడాకారుడు



బాస్కెట్‌బాల్, నెట్‌బాల్ క్రీడల్లో రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని పతకాలు సాధించాను. 2019-20లో జాతీయస్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో పాల్గొన్నాను. తమిళనాడు (2021-22), బెంగళూరు (2022-23)ల్లో జరిగిన ఆలిండియా యూనివర్సిటీ జాతీయస్థాయి పోటీల్లో రాణించాను. క్రీడలను మాత్రమే నమ్ముకున్న వారికి స్పోర్ట్స్ కోటా ఎంతో అవసరం. విద్య, ఉద్యోగాల్లో కొంతమందికైనా అవకాశాలు దక్కుతాయి.

చెరకుకు రూ.5 వేలు మద్దతు ధర ఇవ్వాలి

ఎపి రైతు సంఘం డిమాండ్

ప్రజాశక్తి – ఏలూరు అర్బన్

కేంద్ర ప్రభుత్వం 2023-24 చెరకు క్రషింగ్ సీజన్‌కు టన్ను చెరకుకు ప్రకటించిన రూ.3,150 ధర రైతులకు ఏమాత్రమూ సరిపోదని ఎపి రైతు సంఘం జిల్లా కమిటీ పేర్కొంది. స్థానిక అన్నే భవనంలో చెరకు మద్దతు ధరపై రైతు సంఘం జిల్లా అధ్యక్షులు నిమ్మగడ్డ నరసింహ, జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం సిఎసిపి సిఫార్సు ఆధారంగా ఈ సంవత్సరానికి చెరకు మద్దతు ధర నిర్ణయించినట్లు కేంద్రం ప్రకటించిందన్నారు. పెరిగిన ఉత్పత్తి ఖర్చులను పరిగణనలోకి తీసుకుని మద్దతు ధరను ప్రకటించలేదన్నారు. ప్రతి ఏటా క్వింటాల్‌కు పది రూపాయల చొప్పున నామమాత్రంగా ధరలు పెంచుతున్నట్లుగానే ఈ సంవత్సరం కూడా రూ.పది పెంచి ప్రకటించారే తప్ప పెరుగుతున్న ఉత్పాదక ఖర్చులను వాస్తవికంగా లెక్కగట్టి వాటి ఆధారంగా మద్దతు ధర నిర్ణయించలేదని విమర్శించారు. జాతీయ వ్యవసాయ కమిషన్ ప్రతిపాదించిన విధంగా చెరకు సాగు ఖర్చులు లెక్కించి వాటిపై 50 శాతం పెంచి ధర నిర్ణయిస్తే టన్ను చెరకుకు రూ.ఐదు వేలు ఇవ్వాలని కోరారు.

ఉత్పత్తి ఖర్చులను లెక్కించడానికి అమలులో ఉన్న ఫార్ములాను చెరకు ధర నిర్ణయించడంలో పరిగణనలోకి తీసుకోలేదన్నారు. మద్దతు ధర నిర్ణయించడానికి ప్రాతిపదికగా ఉన్న రికవరీ శాతం 9.5ను 10.5 కు పెంచి రైతులకు నష్టం చేశారన్నారు. కేంద్రప్రభుత్వం చెరకు మద్దతు ధర నిర్ణయం పున:పరిశీలన చేసి 50శాతం ఫార్ములా ప్రకారం టన్నుకి రూ.ఐదు వేలు నిర్ణయించాలని డిమాండ్ చేశారు.



హాస్టల్లో నిద్రిస్తున్న ఐటిడిఎ పిఒ సత్యనారాయణ

సంక్షేమ హాస్టళ్లలో అధికారుల రాత్రి బస

ప్రజాశక్తి – పోలవరం

ఇటీవల పులిరామన్నగూడెం గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల విద్యార్థి హత్యకు గురైన నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం ఐటిడిఎ పిఒ జివి.సత్యనారాయణ, పోలవరం తహశీల్దార్ బి.సుమతి మండలంలో గిరిజన ఆశ్రమ పాఠశాలలను విస్తృత తనిఖీలు చేశారు. అంతకుముందు శుక్రవారం రాత్రి వింజరం పంచాయతీ బోడిగూడెం గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో తహశీల్దార్ తనిఖీలు నిర్వహించి విద్యార్థుల ఆహార నాణ్యతను, మౌలిక సదుపాయాలను పరిశీలించి వసతి గృహంలో విద్యార్థినులతో కలిసి నిద్రించారు. పోలవరం బాపూజీకాలనీ షెడ్యూల్డ్ కులాల బాలుర వసతి గృహంలో ఐటిడిఎ పిఒ జివి.సత్యనారాయణ తనిఖీలు చేపట్టారు. మౌలిక వసతులు, ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించి విద్యార్థులతో కలిసి శుక్రవారం రాత్రి నిద్రించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ గిరిజన ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో మౌలిక వసతులు, ఆహార పదార్థాల నాణ్యత శానిటైజేషన్ తదితర అంశాలపై వసతి గృహ సంరక్షకులకు పలు సూచనలు, హెచ్చరికలు చేశారు. విధుల్లో అలసత్వం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు.

భీమడోలు : ప్రభుత్వ వసతి గృహాల విద్యార్థులు తమకు అందుతున్న సేవలను వినియోగించుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలని మండల ప్రత్యేక అధికారి, డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు కోరారు. స్థానిక బిసి బాలుర ప్రత్యేక వసతి గృహంలో శుక్రవారం రాత్రి ఆయన పల్లె నిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ క్రమంలో రాత్రి విద్యార్థులతో సహపంక్తి భోజనం చేశారు. వారితో కలిసి రాత్రి నిద్రించారు. మర్నాడు శనివారం ఉదయం వారితో పాటు అల్పాహారం తీసుకుని భీమడోలు హై స్కూల్‌ను సందర్శించారు. అక్కడ కొనసాగుతున్న విద్యాబోధన, విద్యార్థులకు కల్పించిన సౌకర్యాలు, ఇతర అంశాలను పరిశీలించారు. వసతి గృహ విద్యార్థులతో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టంతో చదివితే ఉన్నత స్థానాలకు చేరుకుంటారన్నారు. విద్యార్థులతో మమేకమై వారు చదువుతున్న తీరు ఇతర అంశాలను పరిశీలించారు. పలుసూచనలు చేశారు. అనంతరం పలువురు విద్యార్థులు మాట్లాడుతూ తమకు జగనన్న విద్యా కానుక పూర్తిస్థాయిలో చేరలేదని ప్రత్యేకాధికారి దృష్టికి తెచ్చారు. దీనిపై స్పందించిన వసతి గృహ సంరక్షకులు ఎల్.గురుబాబు మాట్లాడుతూ విద్యార్థులకు కేటాయించిన పాదరక్షల సైజులు తేడాగా ఉండటం వల్ల వాటిని వెనక్కి పంపామని, తిరిగి అవి వచ్చిన తర్వాత వాటిని అందజేస్తామని తెలిపారు. తాగునీటి సమస్య కూడా ఉందని వసతి గృహ సంరక్షకులు తెలిపారు. హాస్టల్ ఆవరణలో బోరు ఉన్నప్పటికీ మోటారు లేని కారణంగా దాని సేవలను నిరుపయోగంగా ఉన్నాయన్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా సెప్టిక్ ట్యాంక్ సైజు లేకపోవడంతో తరచుగా అది నిండిపోయి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. డ్రెయినేజీ సమస్యతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, వానాకాలంలో హాస్టల్‌కు ముంపుసమస్య ఎక్కువగా ఉందని తెలిపారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి, విద్యార్థుల ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారితో పాటు మార్క్‌ఫెడ్ సహాయ సంచాలకులు మహేంద్రనాధ్ పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం : స్థానిక ఉప్పలమెట్టలోని అంబేద్కర్ గురుకుల పాఠశాలను జంగారెడ్డిగూడెం జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ రాజరాజేశ్వరి తేజస్వి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో మాటాడారు. పాఠశాలలో చదువు, భోజనం నాణ్యత, సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సిఐ పి.రాజేష్ పాల్గొన్నారు.

ఆర్‌బికె సేవలు వినియోగించుకోండి

ప్రజాశక్తి – భీమడోలు

నాణ్యమైన విత్తనాలు విక్రయం నుంచి వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించడం, పంట విక్రయించిన సొమ్మును రైతుల ఖాతాల్లో జమ చేసేవరకూ అనేక సేవలందిస్తున్న రైతు భరోసా కేంద్రాల సేవలను వినియోగించుకోవాలని ఉంగుటూరు ఎంఎల్‌ఎ పుప్పాల వాసుబాబు కోరారు. శనివారం మండల కేంద్రమైన భీమడోలులో పర్యటించిన ఆయన తొలుత రూ.22.80 లక్షల వ్యయంతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించారు. అందులోని వివిధ విభాగాలను జెడ్‌పిటిసి సభ్యులు తుమ్మగుంట భవాని, ఎంపిపి కనుమాల రామయ్య, భీమడోలు సర్పంచి పి.సునీత మాన్‌సింగ్ ప్రారంభించారు కౌలురైతులకు పంట సాగుకు పత్రాలను శాసనసభ్యులు లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ భీమడోలు సహాయ సంచాలకులు పి.ఉషారాజకుమారి, వ్యవసాయాధికారి ఉషారాణి మండలంలో కొనసాగుతున్న వ్యవసాయ ప్రగతి గురించి శాసనసభ్యులకు వివరించారు. ఇదే క్రమంలో భీమడోలు మండలానికి మూడు డ్రోన్ యూనిట్లు మంజూరయ్యాయని, నిబంధనలను పాటించే అర్హులైన రైతు మిత్ర గ్రూపులకు వాటిని పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకున్నామని వివరించారు. అనంతరం శాసనసభ్యులు సచివాలయం-3 పరిధిలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ ఇంజేటి నీలిమ జూనియర్, మండల ప్రత్యేకాధికారి ఆర్.విజయరాజు, ఎంపిడిఒ సిహెచ్.పద్మావతిదేవి, తహశీల్దార్ ఇందిరాగాంధీ పాల్గొన్నారు.

లోక్ అదాలత్ సేవలు వినియోగించుకోండి


ఉమ్మడి జిల్లా శాశ్వత లోక్ అదాలత్ చైర్‌పర్సన్ ఎ.మేరీగ్రేస్ కుమారి

ప్రజాశక్తి – ఏలూరు అర్బన్

లోక్ అదాలత్ సేవలను వినియోగించుకోవాలని ఉమ్మడి జిల్లా శాశ్వత లోక్ అదాలత్ చైర్‌పర్సన్ ఎ.మేరీగ్రేస్ కుమారి సూచించారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్ ఆధ్వర్యంలో మేరీగ్రేస్ కుమారి అధ్యక్షతన ఏలూరు 49వ డివిజన్ కబాడీగూడెం సచివాలయంలో న్యాయ విజ్ఞాన సదస్సును శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ రవాణా, పోస్టల్, బీమా, వైద్యం, విద్య, బ్యాంకింగ్, ఎన్‌ఆర్ఇజిఎస్, హౌసింగ్, రియల్ ఎస్టేట్, పారిశుధ్యం తదితర సేవల్లో లోపం జరిగినప్పుడు ఈ శాశ్వత లోక్ అదాలత్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. అదాలత్‌లో అన్ని సేవలూ ఉచితంగా అందిస్తారని, అలాగే ఆర్థికంగా వెనుకబడిన పేద, బడుగు బలహీన వర్గాలకు, మహిళలకు ఉచిత న్యాయ సహాయం అందుతుందని తెలిపారు. తెలిసో తెలియకో చిన్న చిన్న గొడవలకు కోర్టులను ఆశ్రయించి డబ్బు, సమయం వృధా చేసుకోకుండా, సమస్యల పరిష్కారానికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని సూచించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ప్యానెల్ అడ్వకేట్ జివి.భాస్కర్ మాట్లాడుతూ జిల్లా న్యాయ సేవాధికార సంస్థలో ఆన్‌లైన్ ద్వారా కూడా న్యాయసహాయం పొందొచ్చని, నల్సా పోర్టల్‌లో తమ ఫిర్యాదును నమోదు చేసుకోవడం ద్వారా ఉచిత న్యాయ సహాయం పొందొచ్చని వివరించారు. అలాగే జాతీయ న్యాయ సేవాధికార సంస్థ టెలీ లా, ప్రొబోను మొదలైన ఆన్‌లైన్ సౌకర్యాలను అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. అలాగే మహిళల రక్షణ కోసం ఏర్పాటు చేసిన చట్టాలను దుర్వినియోగం చేసుకోకూడదని, చట్టాలను అవసరమైనప్పుడు మాత్రమే ఉపయోగించుకోవాలని సూచించారు. అలాగే చట్టాలకు లోబడి ప్రజలు జీవించాలని, చట్టాలు అధిగమించడమే నేరమవుతుందన్నారు. అలాగే ఖైదీలకు, అర్హత కలిగిన ముద్దాయిలకు లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ద్వారా ఉచితంగా కేసులు వాదించడం జరుగుతుందని, దీని నిమిత్తం చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్, డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్, అసిస్టెంట్ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్‌ను నియమించి ఉచిత న్యాయ సహాయం అందిస్తున్నారని, ఈ అవకాశాన్ని అవసరమైన వారు ఉపయోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో 49వ డివిజన్ కార్పొరేటర్ దేవరకొండ శ్రీనివాసరావు, సోషల్ వర్కర్ మేతర అజయ్‌బాబు పాల్గొన్నారు.

రైతు బజారులో తక్కువ ధరకు బియ్యం విక్రయం

ప్రజాశక్తి – నూజివీడు రూరల్



రైతు బజారులో ఏర్పాటు చేసిన బియ్యం కౌంటర్

నూజివీడు పట్టణంలోని రైతు బజార్‌లో ధరల నియంత్రణలో భాగంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు తక్కువ ధరకు బియ్యం విక్రయ కౌంటర్‌ను సివిల్ సప్లయీస్ డిటి వెంకటేశ్వరరావు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణ రకం కిలో రూ.34కు, సూపర్ ఫైన్ మధ్యరకం రూ.40కు, సూపర్ ఫైన్ మంచి రకం రూ.48కు విక్రయిస్తారని ఆయన పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మెప్మా అర్బన్ మార్కెట్లతో మహిళలకు మేలు

ప్రారంభోత్సవంలో మున్సిపల్ చైర్‌పర్సన్ నాగలక్ష్మి

ప్రజాశక్తి – జంగారెడ్డిగూడెం

సిఎం జగన్ చొరవతో ఇ-కామర్స్ విధానం ద్వారా అమెజాన్ వంటి దిగ్గజ సంస్థలతో ఒప్పందం కుదుర్చుకుని ఆన్‌లైన్ ద్వారా డ్వాక్రా మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను నేరుగా కస్టమర్ ఇంటికి డెలివరీ చేసే విధంగా చర్యలు తీసుకోవడం హర్షణీయమని మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన నాగలక్ష్మి అన్నారు. శనివారం స్థానిక పురపాలక సంఘం వద్ద ఏర్పాటు చేసిన మెప్మా అర్బన్ మార్కెట్‌ను నాగలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ పి.భవానిప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ చింతలపూడి ఎంఎల్‌ఎ ఉన్నమట్ల ఎలిజా ఆదేశాల మేరకు డ్వాక్రా మహిళలు తయారు చేసే ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకాలకు మెప్మా అర్బన్ మార్కెట్‌ను ఏర్పాటు చేశారన్నారు. డ్వాక్రా బజార్‌లో ఏర్పాటు చేసిన ఉత్పత్తులు ఎంతో ఆకర్షణీయంగా ఉన్నాయన్నారు. పట్టణ ప్రజలు డ్వాక్రా మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను కొనుగోలు చేసి ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమ ంలో వైస్ ఛైర్మన్లు కంచర్ల వాసవీరత్నం, ముప్పిడి అంజి, వైసిపి టౌన్ ప్రెసిడెంట్ పిపిఎన్.చంద్రరావు, కౌన్సిలర్లు కో-ఆప్షన్ సభ్యులు, టిఎల్ఎఫ్ఒబి సభ్యులు టిఎంసి.నాగమణి, సిఒలు రాధ, రాణి, ఆర్‌పిలు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.



మార్కెట్‌ను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్

అలజడి..!

పులిరామన్నగూడెం గిరిజన సంక్షేమ పాఠశాలలో నాలుగో తరగతి విద్యార్థి హత్య.. కైకలూరు నియోజకవర్గంలో అనుమతుల్లేకుండా యథేచ్ఛగా చెరువుల తవ్వకం, అంగన్వాడీల 36 గంటల నిరవధిక ధర్నా, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ వారాహి రెండో దశ యాత్ర ఉమ్మడి జిల్లాలో అలజడి సృష్టించాయి.

బుట్టాయగూడెం మండలం పులిరామన్నగూడెంలోని గిరిజన సంక్షేమ పాఠశాలలో నాలుగో తరగతి విద్యార్థి హత్య హాస్టళ్లలో వసతులను, భద్రతను తెరపైకి తీసుకొచ్చింది. పదో తరగతి విద్యార్థులే ఈ విద్యార్థిని హత్య చేసినట్లు పోలీసులు ప్రకటించినా సమస్య మాత్రం సద్దుమణగలేదు. ఇద్దరు సీనియర్ విద్యార్థులు నాలుగో తరగతి విదార్థిని పకడ్బందీగా ప్రణాళిక ప్రకారం హత్య చేసేంత కారణాలేమిటీ, ఈ హత్యా ఘటనలో ఇతరుల ప్రమేయం ఏమీ లేదా?, వీరి ప్రవర్తనపై అటు వార్డెన్, ఇటు పాఠశాల సిబ్బందికి ఎవరికీ అనుమానం రాలేదా..? సహచర విద్యార్థులు ఎప్పుడూ ఫిర్యాదు చేయలేదా? వంటి ఎన్నో ప్రశ్నలకు సమాధానాలు లేకుండాపోయాయి. గతంలో జీలుగుమిల్లి మండలం దాట్లవారిగూడెంలో వాల్మీకి విజ్ఞాన కేంద్రంలో విద్యార్థిని అనుమానాస్పద మృతి కేసును తర్వాత అటకెక్కించేశారు. ఈ తరహాలో గత పదేళ్లలో కెఆర్‌పురం ఐటిడిఎ పరిధిలో ఐదుగురు విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారు. ఇవన్నీ వెలుగులోకి వచ్చినవే. రానివి ఎన్నో ఉన్నాయనే ప్రచారం కూడా ఉంది. ఇప్పటికైనా ఐటిడిఎ పరిధిలోని వసతి గృహాలన్నింటిపైనా పర్యవేక్షణ పెంచడంతోపాటు విద్యార్థుల సంక్షేమం, భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని ఈ ఘటనలు చెప్పకనే చెబుతున్నాయి. ఘటన జరిగినప్పుడు హడావుడికన్నా అసలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై పులిరామన్నగూడెం ఘటనను ఆధారంగా తీసుకుని ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని గిరిపుత్రులు కోరుతున్నారు.



ఆక్వా చెరువుల తవ్వకం జిల్లాలో మళ్లీ అలజడి సృష్టిస్తోంది. సారవంతమైన భూముల దగ్గర నుంచి నివాస ప్రాంతాలను దెబ్బతీసే వరకూ చేరుకున్న చెరువుల తవ్వకం తాజాగా తాగునీటి చెరువులను సైతం ధ్వంసం చేసేలా చేపట్టడం చర్చనీయాంశం కావడంతోపాటు ఆందోళన రేకెత్తిస్తోంది. ఈ పరిస్థితి ప్రస్తుతం కైకలూరు నియోజకవర్గంలో ఎక్కువగా ఉంది. అధికార పార్టీ ప్రజాప్రతినిధులే ఈ చెరువుల తవ్వకం వెనుక ఉండి నడిపిస్తుండటంతో అధికారులు సైతం ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఉన్నారని ప్రచారం సాగుతోంది. కనీసం కోర్టు ఆదేశాలతో తవ్వుతున్నారని చెబుతున్నా.. ఆ ఆదేశాలు నిజంగా ఉన్నాయో లేదో మండలస్థాయి అధికారి చెప్పలేకపోవడం, జిల్లాస్థాయి అధికారులకు ఎటువంటి సమాచారమూ లేకపోవడం అధికార యంత్రాంగ నిస్సహాయతకు నిదర్శనంగా చెప్పుకోవచ్చు. కలిదిండి మండలంలో తాగునీటి చెరువు పక్కనే ఆక్వా చెరువు తవ్వకానికి బరితెగించారంటే ఎవరి అండ ఉందో అర్థం చేసుకోవచ్చు. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి అధికారులు సైతం క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లకుండానే చెరువుల తవ్వకాలకు అనుమతులిచ్చేస్తున్నారనే విమర్శలున్నాయి. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు దృష్టిసారించి కనీసం మనిషి జీవించడానికి అవసరమైన తాగునీరు, నివాసం వంటి వాటినైనా ఆక్వా చెరువుల తవ్వకాలతో ధ్వంసం చేయకుండా అడ్డుకట్ట వేయాలని అంతా కోరుతున్నారు.

అంగన్వాడీలు మరోసారి తమ పోరాట పటిమ చూపి అందరికీ ఆదర్శంగా నిలవడంతోపాటు భవిష్యత్తు పోరాటాలకు స్ఫూర్తి నింపారు. గతంలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ 36 గంటల నిరవధిక ధర్నా చేపట్టిన వెంటనే స్పందించాల్సిన ప్రభుత్వం, జిల్లా అధికారులు సైతం మౌనం వహించడం చర్చనీయాంశమైంది. రెండో రోజు అంగన్‌వాడీలు కదంతొక్కుతూ కలెక్టరేట్ల వైపు దూసుకెళ్తుంటే పోలీసులతో అడ్డుకునే ప్రయత్నం తప్ప సమస్యలు తెలుసుకునే ప్రయత్నం జిల్లా అధికారులు చేయకపోవడం విస్మయం కల్గిస్తోంది. భీమవరంలో అయితే పోలీసుల దురుసు ప్రవర్తనతో పలువురు గాయాలతో ఆస్పత్రుల పాలయ్యారు. అయినా పట్టువీడక కలెక్టరేట్ వద్దకు చేరుకుని అధికారులు దిగొచ్చేలా చేసిన అంగన్‌వాడీల పోరాట పటిమ ప్రశంసనీయం. ఢిల్లీ రైతు పోరు, తాజాగా అంగన్‌వాడీల పోరు భవిష్యత్తు పోరాటాలకు దిక్సూచిగా ఉంటాయనడంలో ఎటువంటి సందేహమూ లేదు.

జనసేన అధినేత పవన్ కళ్యాణ్ వారాహి రెండో దశ యాత్ర ఉమ్మడి జిల్లాలో ఆరు రోజులపాటు సాగింది. మొదటి దశ యాత్రకన్నా రెండో దశ యాత్రలో పవన్ ప్రసంగాలు అలజడి సృష్టించాయని చెప్పొచ్చు. వాలంటీర్ల డేటా సేకరణ, స్థానికాంశాలతోపాటు తణుకులో చేసిన వ్యాఖ్యలు కలకలం రేపాయి. పవన్ వ్యాఖ్యలకు నిరసనగా ఇటు వాలంటీర్లు, అటు వైసిపి శ్రేణులు నిరసనలు చేపట్టి దిష్టిబొమ్మల దహనం వంటి చర్యలకు పాల్పడగా, జనసేన శ్రేణులు వాటిని తప్పుబడుతూ పవన్ చిత్రపటాలకు పాలాభిషేకాలు పోటాపోటీగా నిర్వహించారు. ఈ అంశాలన్నీ ఇలా ఉండగా తణుకులో అన్నవరంలో అర్చకుల వేలం పాట గూర్చి ప్రస్తావిస్తూ ఇతర మతాల్లో ఇలా చేస్తారా అంటూ పవన్ ప్రశ్నించడం కలకలం సృష్టించింది. పవన్ జనసేనానిలా కాకుండా తన మిత్రులైన కాషాయదళ నేతలా మాట్లాడారనే విమర్శలు విన్పిస్తున్నాయి. మొత్తంగా ఉమ్మడి జిల్లాలో వారాహి రెండో దశ యాత్ర కొంత అలజడి సృష్టించాయనడంలో ఎటువంటి సందేహమూ లేదు. రానున్న రోజుల్లో జిల్లా రాజకీయాల్లో మార్పులకు, జనసేనకు ఈ యాత్ర ఎంత వరకూ దోహదపడుతుందో వేచిచూడాలి.

-విఎస్ఎస్‌వి.ప్రసాద్

ప్రజాశక్తి
www.prajasakti.com

విద్యార్థులకు డ్రాగన్ ఫ్రూట్స్ పంపిణీ

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మండలంలోని తూర్పు దిగువల్లి గ్రామంలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గ్రామానికి చెందిన తుమ్మూరు శిరీష్ రెడ్డి శనివారం డ్రాగన్ ఫ్రూట్స్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రాగన్ పండ్లు ఎన్నో పోషక విలువలను కలిగి ఉంటాయని వీటిని తినడం ద్వారా పిల్లలలో ఉన్న పోషకాహార లోపాన్ని అధిగమించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బదిలీ సిబ్బందికి సన్మానం

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో బదిలీపై వెళ్లిన సిబ్బందిని శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్.నరేంద్ర సింగ్ మాట్లాడుతూ ఆసుపత్రి అభివృద్ధిలో ప్రజలకు అందిస్తున్న సేవలలో బదిలీపై వెళుతున్న సిబ్బంది కృషి ఎనలేనిదని అన్నారు. వైద్య రంగంలో ప్రజలకు సేవ చేయడమే పరమావధిగా, ఉన్నతాధికారుల ప్రశంసలు పొందుతూ ముందడుగు వేయాలని ఆయన తెలిపారు.

రోడ్డుపై కూలిన భారీ మర్రి చెట్టు

టి.నరసాపురం: మండలంలోని తిరుమల దేవిపేట గ్రామంలో ఆర్అండ్‌బి రోడ్డుపై శనివారం పురాతన భారీ మర్రిచెట్టు కూలింది. దీంతో చింతలపూడి నుంచి జంగారెడ్డిగూడెం వెళ్లే రహదారిపై ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. రాకపోకలు నిలిచిపోవడంతో వాహనదారులు, ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అదేవిధంగా మర్రిచెట్టు కూలడంతో పక్కనే ఉన్న పూరిల్లు దెబ్బతింది. కరెంట్ స్తంభాలు కూలిపోయి పెను ప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న టి.నరసాపురం ఎస్ఐ కె.సతీష్ కుమార్ తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని సంబంధిత అధికారులతో కలిసి రోడ్డుపై అడ్డంగా కూలిన మర్రి వృక్షాన్ని జెసిబి సహాయంతో తొలగించారు. ప్రయాణీకులకు ఏవిధమైన అంతరాయం కలగకుండా ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

అభివృద్ధి పనుల కోసమే మట్టి తోలకాలు

ముసునూరు: గ్రామ పంచాయతీ సర్పంచిగా రోడ్లు అభివృద్ధికై మట్టి తోలకాలు నిర్వహిస్తే తమపై పోలీసులకు ఫిర్యాదు చేయడం తీవ్ర అన్యాయమని కాట్రేనిపాడు సర్పంచి గద్దల సుహాసిని మోహనరావు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో మండలంలోని కాట్రేనిపాడు గ్రామంలో పలు మట్టి రోడ్లకు గ్రావెల్ తోలకాలు నిర్వహిస్తున్నారా, గ్రామ వైసిపి నాయకులు అక్రమ మట్టి రవాణా జరుగుతుందని ముసునూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ యం.కుటుంబరావు తమ సిబ్బంది ద్వారా పలు ట్రాక్టర్లు, జెసిబిని పోలీస్ స్టేషన్‌కు తరలించడంతో గ్రామస్తులు, గ్రామ టిడిపి నాయకుల ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించగా శనివారం జరిమానా కట్టి విడుదల చేసినట్లు తెలిపారు.

మాణిక్యాలరావుకు ఘనస్వాగతం

ఏలూరు: లయన్స్ జిల్లా గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు అమెరికాలోని బోస్టన్‌లో జరిగిన అంతర్జాతీయ కన్వెన్షన్‌లో పాల్గొని జిల్లా గవర్నర్‌గా ప్రమాణ స్వీకారం చేసి నేడు ఏలూరు చేరుకున్న సందర్భంగా లయన్స్ గ్రీన్ సిటీలోని లయన్స్ భవనంలో స్వాగత సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాణిక్యాలరావు మాట్లాడుతూ లయన్స్ ఇంటర్నేషనల్ సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ పట్టి హిల్ ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అన్ని జిల్లాల గవర్నర్లతో ప్రమాణ స్వీకారం చేయించారన్నారు. పట్టి హిల్ ఈ సంవత్సరం సమానత్వం కాంక్షించి సామాజిక మార్పుకు దోహదపడాలనే నినాదంతో సేవలందించాలని పిలుపునిచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వపు జిల్లా గవర్నర్లు వేమా కోటేశ్వరరావు, కెవి కిషోర్ కుమార్, జిల్లా కేబినెట్ సెక్రెటరీలు ఎస్.నాగమల్లేశ్వరరావు, కొమ్మిన మురళీకృష్ణ, కోశాధికారి వి.రామకృష్ణారావు, జిల్లా గాట్ నాయకులు అవినాష్‌రాజ్, చంద్రశేఖరరెడ్డి, వి.సత్యస్వరూప్, కొరిపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

ముసునూరు: కుటుంబ కలహాల నేపథ్యంలో వ్యక్తి(35) పురుగుల మందు సేవించి మృతి చెందిన ఘటన ముసునూరు మండలంలో చోటుచేసుకుంది. ఎస్ఐ ఎం.కుటుంబరావు తెలిపిన వివరాలు ప్రకారం మండలంలోని గుళ్ల పూడి గ్రామానికి చెందిన దూదిగం రంగారావు శుక్రవారం మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల సమయంలో మద్యం సేవించి ఇంటిలో గొడవపడ్డాడు. దీంతో మద్యంలో పురుగుల మందు వేసుకుని సేవించడంతో తమ భార్య, కుటుంబ సభ్యులు గమనించి లింగపాలెం మండలం ధర్మాజీగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యం పొందుతూ శనివారం మెరుగైన వైద్యం నిమిత్తం గన్నవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో చనిపోయారు. ఇతనికి భార్య, ఇద్దరు మగపిల్లలు కలరు. కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగించే అతను చనిపోవడంతో ఆ కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆమె భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కుక్కల దాడిలో మూడు గేదెలు మృతి

ముసునూరు: ఊర కుక్కల దాడిలో మూడు పాడి గేదెలు మృతి చెందడంతో ఆ కుటుంబం జీవనాధారం లేకుండా పోయింది. ముసునూరు మండలం నెలపాటివారికుంట పరిధిలో దాల్లరి నాగభూషణంకు చెందిన రెండు లేగదూడలు, ఒక పాడి గేదెపై ఊరకుక్కలు దాడి చేసి చంపివేశాయి. మరోక గేదె తోక కత్తిరించి, పాలు ఇచ్చే పొదుగుపై కుక్క గాటులు పెడుతూ వున్న సమయంలో రైతు చూసి వాటిని తోలే పరిస్థితిల్లో తనపై దాడికి దిగాయన్నారు. చుట్టుపక్కల వారు రావడంతో అంతటితో ఆగిపోయాయని గేదెల యాజమాని ఆవేదన వ్యక్తం చేశాడు. కుక్కల దాడితో నష్టపోయిన ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.

డ్రెయినేజీలో పడి వ్యక్తికి గాయాలు

నూజివీడు రూరల్: పెద్ద గాంధీ బొమ్మ సెంటర్ వద్ద బైక్‌పై వస్తున్న చికెన్ వ్యాపారి అబ్దుల్లా ప్రమాదవశాత్తు శనివారం డ్రయినేజీలో పడిపోయారు. సమీపంలో ఉన్న మున్సిపల్ కౌన్సిలర్ కందుల సత్యనారాయణ హుటాహుటిన వచ్చి ప్రమాదంలో ఇరుక్కున్న అబ్దుల్లాను రక్షించారు. డ్రయినేజీలపై సిమెంటు పలకలు ఏర్పాటు చేయాలని ఎన్నిసార్లు అధికారులకు చెప్పిన పెడచెవిన పెట్టారని, సత్వరమే నివారణ చర్యలు చేపట్టాలని స్థానిక ప్రజలు కోరారు.

దాడి ఘటనలో వ్యక్తిపై కేసు

టి.నరసాపురం: దాడి చేసిన ఘటనలో వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కె.సతీష్ కుమార్ శనివారం విలేకరులకు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని బొర్రంపాలెం గ్రామానికి చెందిన జొరిగే మోహన్‌సత్యనారాయణ స్థానికంగా టిఫిన్ బండి నడుపుకుంటున్నాడు. ఈ క్రమంలో ఈనెల 10న రాత్రి 8 గంటల సమయంలో తన టిఫిన్ బండి వద్ద ఉండగా పక్కనే మద్యం తాగుతున్న వారిని పోలీసులు చెదరగొట్టారన్నారు. దీంతో వారు వెళ్ళిపోయారని అనంతరం కొంతసేపటికి అదే గ్రామానికే చెందిన గాజుల బాలాజీ అలియాస్ బాలు అనే వ్యక్తి వచ్చి మా గురించి చెడుగా తిడుతున్నావని అకారణంగా గొడవపెట్టుకొని, తిట్టి చేతులతో కొట్టినట్లు ఫిర్యాదు చేయగా అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

దాడి చేసిన ఆరుగురిపై కేసు

నూజివీడు రూరల్: రావిచెర్ల గ్రామానికి చెందిన ముల్లంగి ఆశీర్వాదం అనే వ్యక్తి తనపై ఆరుగురు వ్యక్తులు దాడిచేసి కొట్టారని రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. శనివారం బాధితుడు తెలిపిన వివరాలకు మేరకు గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమం పూర్తైన తర్వాత నూజివీడు వెళ్లి తిరిగి వస్తుండగా చిన్న చెరువు కట్ట వద్ద అగ్నిపతి మాణిక్యాలరావు, నాయుడు జ్యోతి బాబు, ముల్లంగి సురేష్, లాభాను, వినయ్, కోట అనిల్‌లు ఆటోలో ఎదురై ఇంటి పట్టా విషయంలో అవహేళనగా మాట్లాడారన్నారు. తిరిగి సాయంత్రం ఐదు గంటల సమయంలో పిహెచ్‌సి వద్దకు వచ్చిన సమయంలో అక్కడే ఉన్నవారు తనను అడ్డగించి, నోటికి వచ్చినట్లు మాట్లాడి కింద పడేసి కొట్టడంతో పాటు చంపేస్తామని బెదిరించినట్లు తెలిపారు. తన భార్య సహకారంతో నూజివీడు ప్రభుత్వ ఆసుపత్రిలో చేరగా వైద్యులు చికిత్స అందించినట్లు బాధితులు ఆశీర్వాదం తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎఎస్ఐ ఎ.శ్రీనివాసరావు తెలిపారు. అయితే ఈ ఘటనపై ప్రత్యర్థుల సైతం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ప్రతిఒక్కరూ సత్ప్రవర్తన కలిగి ఉండాలి

ప్రజాశక్తి - చింతలపూడి

ప్రతిఒక్కరూ సత్ప్రవర్తన కలిగి, కష్టపడి పనిచేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుని గ్రామాలలో గౌరవంగా బతకాలని చింతలపూడి జూనియర్ సివిల్ న్యాయమూర్తి సి.మధుబాబు తెలిపారు. మండలంలో జూనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవల కమిటీ వారు సబ్ జైల్‌ను సందర్శించి అందులో వున్న ముద్దాయిలకు అందిస్తున్న ఆహారం, వసతి, వైద్య సదుపాయాలు, వారి కేసులు వివరములు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ఎవరికైనా న్యాయవాదిని పెట్టుకునే ఆర్థిక పరిస్థితి లేనపుడు మండల న్యాయ సేవల కమిటీ ద్వారా న్యాయవాదిని ఏర్పాటు చేస్తారన్నారు. శిక్ష పడిన ముద్దాయిలకు కూడా అప్పీల్ చేయుటకు ఉచిత న్యాయవాదిని ఏర్పాటు చేస్తారని తెలిపారు. అనంతరం ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ కష్టపడకుండా డబ్బులు సంపాదించలేరని, అక్రమ మార్గాలలో డబ్బు సంపాదించాలనుకుంటే జైలులో ఉండాల్సి వస్తుందన్నారు.

సెప్టెంబర్ 9న లోక్ అధాలత్

చింతలపూడి కోర్టు పరిధిలో ఉన్న కక్షిదారులకు సెప్టెంబర్ 9, 2023న కోర్టులో జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నారని దానిలో రాజీపడు క్రిమినల్ కేసులు రాజీ, విలువైన సమయము, డబ్బు ఆదా చేసుకుని గ్రామాలలో ప్రశాంతంగా జీవించాలని పత్రికాముఖంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో జైల్ విజిట్ ప్యానల్ న్యాయవాదులు బుల్లా ఏసుపాదం, పారా లీగల్ వాలంటీర్ యండి అక్బర్ అలీ, జైలు సూపరింటెండెంట్ గోలి వెంకటేశ్వరరావు, హెడ్ వార్డర్ సాంబశివ రావు పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంక్ ద్వారా రైతులకు విస్తృత సేవలు

ద్వారకాతిరుమల: యూనియన్ బ్యాంక్ ద్వారా రైతులకు విస్తృతమైన సేవలు అందిస్తున్నట్లు జోనల్ ఆఫీస్ ఎజీఎం కెవెల్ సుధాకర్ తెలిపారు. రాళ్ల కుంట గ్రామంలో శనివారం కృష్ణ డైరీ వద్ద గంట నాగేశ్వరరావు ఆధ్వర్యంలో యూనియన్ బ్యాంక్ కిసాన్ మేళా రైతులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎజీఎం కెవెల్ సుధాకర్ మాట్లాడుతూ యూనియన్ బ్యాంకు ద్వారా రైతులకు 32 రకాల సేవలు అందిస్తున్నామన్నారు. రైతులకు అవసరమైన సేవలు ఉన్నతాధికారులతో మాట్లాడి అందిస్తామన్నారు. యూనియన్ బ్యాంకు ద్వారా అందిస్తున్న సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా ఆయన రైతులను కోరారు. ఈ కార్యక్రమంలో రీజనల్ ఆఫీస్ వ్యవసాయాధికారి వినోద్ కుమార్, బ్రాంచ్ మేనేజర్ శేషు, ఆర్‌డిఒ ప్రియాంక, రైతులు పాల్గొన్నారు.

గ్లోబల్ అవార్డు గ్రహీత రఘుకు ప్రశంసలు

పోలవరం: హైదరాబాద్ జిసిఎస్ వల్లూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కోవిడ్ కష్టకాలంలో సేవలు అందించిన పోలవరం గ్రామానికి చెందిన సినిమా టీవీ ఆర్టిస్ట్ తోలేటి రఘుబాబుకి ప్రతిభా రత్న అవార్డు రావటం పట్ల శనివారం పోలవరం గ్రామంలో పలువురు ప్రముఖులు రఘుని ప్రశంసించారు. ఈ సందర్భంగా రఘు మాట్లాడుతూ కోవిడ్ కష్టకాలంలో పోలవరం మండలంలో ప్రజలకు తన అభ్యుదయ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ద్వారా ఉచితంగా ఆహారం పంపిణీ చేసినందుకు ఈ అవార్డు దక్కిందన్నారు. హైదరాబాద్ జిసిసి వల్లూరి ఫౌండేషన్ గ్లోబల్ ఎన్విరాన్మెంటల్ క్లైమేట్ 2023 అవార్డుని జిసిఎస్ వల్లూరి ఫౌండేషన్ 50వ వార్షికోత్సవం సందర్భంగా తనకు ప్రకటించినందుకు వల్లూరి ఫౌండేషన్ ఛైర్మన్ విఆర్ శ్రీనివాసరాజుకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మౌనరాగం సీరియల్ డైరెక్టర్ కోరిక మేరకు ఆ సీరియల్‌లో నటించడం జరిగిందన్నారు. మరిన్ని సీరియల్స్‌లో అవకాశాలు వచ్చాయని, ప్రస్తుతం పుష్ప 2 సినిమాలో పోలీస్ పాత్ర చేస్తున్నట్లు తెలిపారు. తనలో ప్రతిభను గుర్తించి ప్రోత్సహించిన పోలవరం మండల ప్రజలకు, ప్రముఖులకు, స్నేహితులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.


పేదలకు సాయం చేస్తున్న ఆకుమర్తి రామారావు

నిరుపేదలకు ఆకుమర్తి సాయం

జంగారెడ్డిగూడెం: మండలంలోని పేరంపేట గ్రామంలో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న మూడు పేద కుటుంబాలకు నారా లోకేష్ సేవా సమితి అధ్యక్షుడు, టిడిపి ఎస్‌సి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుమర్తి రామారావు ఆర్థిక సహాయం అందించారు. శనివారం టిడిపి మండల అధ్యక్షుడు సాయిల సత్యనారాయణ ఆధ్వర్యంలో పెరంపేట గ్రామ పార్టీ అధ్యక్షులు గోలి రామకృష్ణారెడ్డి అధ్యక్షతన మూడు పేద దళిత కుటుంబాలకు ఆర్థిక సహాయం చేయడం జరిగింది. గ్రామంలో పోలియో వల్ల రెండు కాళ్లు పనిచేయక ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న చదలవాడ కిషోర్‌కు రూ.5,000లు, ఇటీవల అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన కొత్ర నరసయ్యకు 25 కేజీల బియ్యం, వంట సామాగ్రి, దుప్పట్లు, రూ.2,000లు నగదు అందజేయడం జరిగింది. ఇటీవల కాలంలో గుండెపోటుతో మృతి చెందిన తమిర్సి అంజీయ్య కుటుంబానికి రూ.3,000ల నగదు అందజేశారు. ఈ సందర్భంగా ఆకుమర్తి రమారావు మాట్లాడుతూ నారా లోకేష్ సేవా సంస్థ ద్వారా ఆపదలో ఉన్న పేదలకు తనవంతు సహాయం చేయడం ఆత్మ సంతృప్తి కలిగిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పేరంపేట టిడిపి అధ్యక్షుడు గోలి రామకృష్ణారెడ్డి, గ్రామ సర్పంచి కంకిపాటి కుమారి, ఉప సర్పంచి గోలి సత్తి రెడ్డి, చింతలపూడి నియోజకవర్గం మహిళా కన్వీనర్ చిలపరెడ్డి ఇంద్రాణి పాల్గొన్నారు.

అటవీ భూములు పంపిణీ చేయాలి

ప్రజాశక్తి - చింతలపూడి

ఉమ్మడి యాజమాన్యంతో సంబంధం లేకుండా విఎస్ఎస్ సభ్యులకు అటవీ భూమి ఒక్కొక్కరికి హెక్టారు చొప్పున పంపిణీ చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు మామిళ్లపల్లి వసంతరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం చింతలపూడి మండల మహాసభ బోడా వజ్రం అధ్యక్షతన జరిగింది. ఈ మహాసభకి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జిల్లా అధ్యక్షులు మామిళ్లపల్లి వసంతరావు మాట్లాడుతూ 'దున్నేవాడిదే భూమి' అనే నినాదంతో వ్యవసాయ కార్మికులను సమీకరించి వేలాది ఎకరాల బంజర భూములను పంచిన ఘనత సిపిఐ వ్యవసాయ కార్మిక సంఘంది అన్నారు. వ్యవసాయ కార్మికుల పోరాట ఫలితంగానే అసైన్మెంట్ చట్టం రూపొందింది అన్నారు. సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య మాట్లాడుతూ మణిపూర్ ఘటనపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఎందుకు మౌనంగా ఉంటున్నారని, తక్షణం మణిపూర్ అంశంపై ప్రధానమంత్రి మోడీ మాట్లాడాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బిజెపి ఆనాడు ఎన్నికలకు ముందు ధరలు తగ్గిస్తామని, నల్లధనాన్ని వెలికి తీస్తామని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి తొమ్మిది సంవత్సరాలు కావస్తున్నా ఇప్పటికీ ధరలు అదుపు చేయడంలో విఫలం చెందిందన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బండి వెంకటేశ్వరావు మాట్లాడుతూ కోనేరు రంగారావు భూ కమిషన్ సిఫారసులు అమలు చేయాలని, భూ పంపిణీ నవరత్నాల్లో చేర్చాలని, ఉపాధి హామీ కూలీలకు 200 రోజుల పని దినాలు కల్పించి రోజు కూలి రూ. 600 ఇవ్వాలని అన్నారు. అనంతరం సిపిఐ మండల కార్యదర్శి కంచర్ల గురవయ్య, సహాయ కార్యదర్శులు పుల్లూరు సోమశేఖర్, తొర్లపాటి బాబు, ఎఐటియుసి ఏరియా కార్యదర్శి కంకిపాటి బుచ్చిబాబు, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి ఇస్తరాకుల వెంకటేశ్వరరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మంలాజరు బోడ లక్ష్మణరావు, వనం కృష్ణ ఎస్కే మస్తాన్, గట్టు వెంకటేశ్వరరావు, సికా కోళ్ల బాబురావు, నారపాం వెంకటేశ్వరావు పాల్గొన్నారు.


వసతి గృహంలో జంగిల్ క్లియర్

ప్రజాశక్తి - ముసునూరు

సబ్‌కలెక్టర్ ఆదర్శరాజేంద్రన్ ఆదేశాల నుసారం శనివారం మండల కేంద్రమైన బాలుర వసతి గృహం నందు ఉపాధి కూలీలు జంగల్ క్లియర్ చేశారు. శుక్రవారం రాత్రి నూజివీడు సబ్‌కలెక్టర్ ఆదర్శరాజేంద్రన్ బిసి హాస్టల్‌లో పల్లె నిద్రలో భాగంగా బస చేయగా విద్యార్థులు జడ్‌పి పాఠశాల్లో మధ్యాహ్నం భోజనం బాగోలేదని, హాస్టల్‌లో కుడా సరియైన వసతులు లేవని, తమ గదుల్లోకి పాములు వస్తున్నాయని సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకు వచ్చారు. ఉపాధిహామి టిఎ.రవికుమార్ ఆధ్వర్యంలో బిసి హాస్టల్ వెనుక భాగంలో ఉన్న చెట్లు తొలగింప చేశారు. జడ్‌పి పాఠశాల ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజనం పరిశీలించి, కోడిగుడ్లు సరిగ్గా ఉడకడం లేదని, భోజనం పెట్టాలని ప్రధానోపా ధ్యాయులను ఆదేశించారు.

రెండో విడతలో 12,500 పాఠ్యపుస్తకాలు

ప్రజాశక్తి - భీమడోలు


పాఠ్యపుస్తకాలు స్వీకరిస్తున్న భీమడోలు విద్యాధికారి

మండలానికి సబ్జెక్టుల వారీగా రెండో విడత పాఠ్య పుస్తకాలు వచ్చాయని విద్యాధికారి భాస్కరకుమార్ తెలిపారు. దీనిలో భాగంగా మండలానికి కేటాయించిన 12,500 పాఠ్యపుస్తకాలు ఆర్‌టిసి బస్సు ద్వారా స్థానిక మండల వనరుల కేంద్రానికి శనివారం సాయంత్రం చేరుకున్నాయ న్నారు. వీటిని మండల విద్యాధికారితో పాటు సిఆర్‌పిలు స్వీకరించారు. ఈ సందర్భంగా మ ండల విద్యాధికారి మాట్లాడుతూ రెండవ విడతగా వ చ్చిన పాఠ్యపుస్తకాలను సబ్జెక్టుల వారీగా, పాఠశాల వారీగా విభజించి గురువారం నుంచి వాటి పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తామన్నారు. 18 సంవత్స రాలలోపు వయస్సు వారందరూ విధిగా పాఠశాలలో చేరేందుకు చర్యలు తీసుకోవాలని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు, విద్యాధికారికి విజ్ఞప్తి చేశారు. పదవ తరగతి పూర్తి చేసుకుని విద్యాభ్యాసాన్ని కొనసాగించని వారిని గుర్తించి వారు తిరిగి తమ విద్యాభ్యాసాన్ని కొనసాగించేందుకు చర్యలను తీసుకుంటామన్నారు. ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో అర్థాంతరంగా మానేసిన విద్యార్థులను డ్రాప్‌అవుట్లుగా గుర్తించి వారు సైతం పాఠశాలలో కొనసాగే విధంగా ప్రధానోపాధ్యాయుల సహకారంతో చర్యలు తీసుకునేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. ఇదే తరహాలో భీమడోలు హైస్కూల్లో 117, పూళ్ళ హైస్కూల్లో 54 మంది డ్రాప్ అవుట్‌లు ఉన్నట్టు గుర్తించామన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు భీమడోలు ఎంపిడిఒతో కలిసి మండల పరిధిలోని పూళ్ళ హైస్కూల్, అదే గ్రామంలోని రెండు ప్రాథమిక పాఠశాలను సందర్శించామన్నారు. అక్కడ కొనసాగుతున్న విద్యాబోధన, అందుబాటులో ఉన్న సౌకర్యాల వినియోగం, కావాల్సిన సౌకర్యాల అంచనా పరిశీలించామని ఆయన తెలిపారు.

మండవల్లి ఎంఇఒ-1గా రామారావు

ప్రజాశక్తి - మండవల్లి


మండవల్లి మండలానికి నూతన విద్యాశాఖాధికారి 1 గా డి.రామారావు శనివారం పదవి బాధ్యతలు చేపట్టారు. ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన బదిలీలలో భాగంగా మండవల్లి మండలానికి విద్యాశాఖ అధికారిగా విధులు నిర్వహిస్తున్న నరేష్ కుమార్ ముదినేపల్లి మండలానికి విద్య శాఖ అధికారి 1 గా బదిలీపై వెళ్లారు. దీంతో డి.రామారావు మండవల్లి విద్యాశాఖ అధికారిగా ఎఫ్ఎసిగా బాధ్యతలు తీసుకున్నారు. ఇప్పటికే మండల విద్యాశాఖ అధికారి 2 గా ఎస్.రత్నసునాదం విధులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో విద్యాశాఖ అభివృద్ధికి మరింత కృషి చేస్తానని అన్నారు.

'జగనన్న సురక్ష' ద్వారా సత్వర సేవలు

ప్రజాశక్తి - పోలవరం

గ్రామంలో సచివాలయం-3 పరిధిలో నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ ఐటిడిఎ పిఒ జివివి సత్యనారాయణ అధ్యక్షతన సర్పంచి పొడుం పుష్ప ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏలూరు జిల్లా ఎంపిపిల సంఘం అధ్యక్షులు పోలవరం ఎంపిపి సుంకర వెంకటరెడ్డి, తహశీల్దార్ బి.సుమతి, ఎంపిడిఒ జి .శ్రీను, జడ్‌పిటిసి కలుం హేమకుమారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపిపి సుంకర వెంకటరెడ్డి మాట్లాడుతూ జగనన్న ప్రవేశపెట్టిన సురక్ష కార్యక్రమంలో ప్రజలకు అవసరమైన సర్టిఫికెట్లు, పెన్షన్ల విషయంలో త్వరితగతిన సమస్య పరిష్కారానికి అధికారుల నుంచి వెంటనే స్పందన లభించిందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇంతకు ముందు ప్రభుత్వంలో పెన్షన్ తీసుకోవాలి అంటే పంచాయతీల వద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకూ తిండి తిప్పలు లేకుండా నిలబడాల్సి వచ్చేదని, జగనన్న ప్రభుత్వంలో ఇంటింటికి వెళ్లి వాలంటీర్లే పెన్షన్లు ఇవ్వడం జరుగుతుందని అన్నారు. తదుపరి లబ్ధిదారులకు ఇన్‌కమ్ క్యాస్ట్ కొత్త పెన్షన్‌ల సర్టిఫికెట్లను అందజేయడం జరిగింది. ఎంపిటిసి కోఆప్షన్ సభ్యులు, మండల అధికారులు ఇప్పటివరకు జగనన్న ప్రవేశపెట్టిన పథకాల గురించి వివరంగా తెలియజేశారు.


చింతలపూడి: ప్రతి ఇంటికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు నేరుగా ప్రభుత్వం అందిస్తుందని జిల్లా జడ్‌పిటిసి ఇఒ రవికుమర్ అన్నారు. సీతానగరంలో జగనన్న సురక్ష కార్యక్రమం గ్రామ సర్పంచి యడ్ల మోహన్ రావు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజలకు అవసరమైన ధృవీకరణ పత్రాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ మురళీకృష్ణ, డిప్యూటి తహశీల్దార్ షకిలా, సచివాలయం కన్వినర్ త్సల్లాబత్తుల శ్రీనివాసరావు పాల్గొన్నారు.


తిమ్మాపురంలో జగనన్న సురక్ష..

ద్వారకాతిరుమల: తిమ్మాపురంలో జగనన్న సురక్ష కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా జిల్లా ఏలూరు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, గోపాలపురం నియోజకవర్గం ఎంఎల్ఎ తలారి వెంకట్రావు పాల్గొన్నారు. అనంతరం గర్భిణీలకు శ్రీమంతం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ముసునూరు: మరలా అధికారంలోకి వచ్చేది జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనేనని మండల వైసిపి అధ్యక్షులు మూల్పురి నాగవల్లేశ్వరరావు అన్నారు. శనివారం మండలంలోని కోర్లగుంటలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వైసిపి మండల అధ్యక్షులు మూల్పురి నాగవల్లేశ్వరరావు మాట్లాడుతూ వాలంటీర్లు ద్వారా ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి, ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రిదే అన్నారు. క్రిస్టియన్లుకు శ్మశానవాటిక చూపించలేక పోతున్నామని గ్రామస్థులతో కలిసి జడ్‌పిటిసి సభ్యులు వరికూటి ప్రతాప్‌కు వినతిని అందజేశారు. ఆదేవిధంగా రూ.30లక్షలతో వాటర్ ట్యాంక్ నిర్మాణం, రూ.40వేలతో పైపులైను నిర్మాణం ఏర్పాటు చేయడంతో జడ్‌పిటిసి డాక్టరేట్ ప్రతాఫ్, వైస్ ఎంపిపి కోటగిరి రాజానాయన, సర్పంచి నక్కనబోయిన సత్యనారాయణ, ఎంపిటిసి సుందరరావులచే ప్రారంభింప చేశారు.

మండవల్లి: అందరికీ ప్రభుత్వ పథకాలు అందజేయడమే జగనన్న సురక్ష ప్రధాన ధ్యేయమని కైకలూరు ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు స్పష్టం చేశారు. మండలంలోని పెరికేగూడెంలో సచివాలయ పరిధిలో శనివారం నిర్వహించిన జగనన్న సురక్షలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో అర్హులై ఉండి పథకం అందని వారంటూ ఎవరూ లేరన్నారు. అంతటి సుపరిపాలనను అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని అన్నారు. తండ్రికి తగ్గ తనయుడిగా పేదల పక్షాన నిలబడి పేదల అభివృద్ధి కోసం అహర్నిశలు పాటుపడుతున్నారన్నారు. అనంతరం దరఖాస్తుదారులకు సర్టిఫికెట్లను అందించి మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పెద్దిరెడ్డి శ్రీ రామ దుర్గాప్రసాద్, జడ్‌పిటిసి ముంగర విజయనిర్మల, సర్పంచి పెరుమాళ్ల పద్మ, ఎంపిటిసి పెరుమాల లక్ష్మి, మండల అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, సర్పంచిల ఫోరం అధ్యక్షులు బేతపూడి ఏసేవ రాజు పాల్గొన్నారు.


మండవల్లిలో..


జగనన్న సురక్షతో పేదలకు ఎంతో మేలు

ముదినేపల్లి: జగనన్న సురక్షతో పేద ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందని కైకలూరు ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు పేర్కొన్నారు. ముదినేపల్లి మండలం వాడవల్లి గ్రామ సచివాలయ పరిధిలో శనివారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమమునకు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం నెల రోజుల పాటు జరుగుతుందన్నారు. దీనిని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి సుధాబత్తుల లక్ష్మి పద్మావతి, ఎంపిటిసి దూసనపూడి లక్ష్మి కుమారి పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం: జగనన్న సురక్ష కార్యక్రమంతో సచివాలయాల సేవలు ప్రజలకు మరింత చేరువ అయ్యాయని మున్సిపల్ ఛైర్‌పర్సన్ బత్తిన నాగలక్ష్మి అన్నారు. శనివారం పట్టణంలోని ఐదవ సచివాలయం పరిధిలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బత్తిన నాగలక్ష్మి మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం వచ్చాక సచివాల వ్యవస్థని మన వార్డు చివర పెట్టి ప్రజలకు ఇంటింటికి వెళ్లి వాలంటరీ వ్యవస్థ ద్వారా ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ ఫలాలను ప్రతి ఇంటికి అందిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్ కంచర్ల వాసవి రత్నం, ముప్పిడి అంజి, పట్టణ అధ్యక్షులు పిపిఎన్ చందర్రావు పాల్గొన్నారు.

శ్రీనివాసరావుకు పితృవియోగం

ఆగిరిపల్లి: శ్రీభాగ్యలక్ష్మీ ఇండియన్ గ్యాస్ మేనేజింగ్ పార్టనర్ పాలడుగు వెంకట శ్రీనివాసరావుకు పితృవి యోగం కల్గింది. ఆయన తండ్రి అయిన పాలడుగు వెంకటేశ్వరరావు శనివారం మధ్యాహ్నం గుండెపోటుతో మరణిం చారు. ఆదివారం ఉదయం విజయవాడలోని ఆయన స్వగృహం నందు అంతిమయాత్ర నిర్వహించటం జరుగుతుందని పివి.శ్రీనివాసరావు పేర్కొన్నారు.


వెంకటేశ్వరరావు

పారిజాతగిరిలో అన్నదానం

జంగారెడ్డిగూడెం: స్థానిక గోకుల తిరుమల పారిజాత గిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించామని ఆలయ కార్య నిర్వహణ అధికారి మానికల రాంబాబు తెలిపారు. శనివారం పట్టణానికి చెందిన షేక్ నజీర్, కోయ రాజమండ్రికి చెందిన దువ్వ రామ సీతల ఆర్థిక సహకారంతో అన్న ప్రసాద వితరణ జరిపినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, ఆలయ ప్రధానార్చకులు రవికుమార్ పాల్గొన్నారు.

ఉదయ్‌కిరణ్‌కు సత్కారం

ఏలూరు అర్బన్: ఏలూరు కొత్త రోడ్‌లోని నవసమాజ్ సొసైటీ కార్యాలయంలో శనివారం ఉమ్మడి కృష్ణా జిల్లా కంచికచర్ల ఎంపిటిసిగా బిఎస్‌పి పార్టీ నుంచి పోటీచేసి గెలుపొందిన బర్రె ఉదయ్ కిరణ్‌ను ఘనంగా సత్కరించి సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఉదయ్ కిరణ్ మాట్లాడుతూ ఆధిపత్య కులాల పార్టీలతో సంబంధం లేకుండా బిఎస్‌పి తరపున పోటీ చేసి ఎంపిటిసిగా గెలుపొందానన్నారు. రాబోయే 2024 ఎన్నికల్లో బిసి, ఎస్‌సి, ఎస్‌టి మైనారిటీలందరూ ఒక్కటై బహుజన రాజ్యాధికారం సాధించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బహుజన్ సమాజ్ పార్టీ(బిఎస్‌పి) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నేతల రమేష్ బాబు, దెందులూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి కర్రే అంబేద్కర్, భూపతి అప్పారావు, ఎల్ఐసి రాజా పాల్గొన్నారు.